క్లుప్తంగా


మోదకొండమ్మ తల్లి గుడికి సూరిశెట్టి విరాళం



విరాళం అందజేస్తున్న మాజీ ఎంపీటీసీ సభ్యురాలు సుధారాణి

మునగపాక: మునగపాక బైపాస్ రోడ్డులో నిర్మిస్తున్న శ్రీ మోదకొండమ్మ ఆలయానికి పలువురు భక్తులు తమ వంతు సాయంగా విరాళాలు అందజేస్తున్నారు. మునగపాకకు చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యురాలు సూరిశెట్టి సుధారాణి తనవంతుగా ఆలయ నిర్మాణానికి రూ.10,116 నగదును విరాళంగా కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో సూరిశెట్టి శ్రీనివాస్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా వినాయక ఆలయ వార్షికోత్సవం



పూజలందుకుంటున్న వినాయకుడు

మునగపాక: మునగపాక పల్లపు వీధిలోని వినాయక ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి వినాయకుడిని దర్శించుకునేందుకు భక్తులు తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు తగు చర్యలు తీసుకున్నారు.

కొబ్బరి మొక్కలు దగ్ధం

మునగపాక: మండలంలోని తోటాడ పంచాయతీ గరికిమటం సమీపంలో కొబ్బరి మొక్కలు మంగళవారం అగ్నికి ఆహుతయ్యాయి. ఈ మేరకు విద్యుత్ శాఖ, రెవెన్యూ అధికారులకు బాధిత రైతు బొడ్డేడ అప్పారావు ఫిర్యాదు చేశారు. పది సంవత్సరాల క్రితం 79 సెంట్ల విస్తీర్ణంలో కొబ్బరి మొక్కలు నాటారు. మంగళవారం విద్యుత్ వైర్ల నుంచి వచ్చిన నిప్పురవ్వల కారణంగా మొక్కలు కాలిపోయాయి. దీంతో సుమారు రూ.లక్షకు పైగా ఆస్తినష్టం సంభవించిందని, తనకు న్యాయం చేయాలని కోరుతూ రైతు అప్పారావు అధికారుల వద్ద మొరపెట్టుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం: కొరుప్రోలు సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. వమ్మవరం, గెడ్డపాలెం, గోకులపాడు, భీమవరం గ్రామాల మీదుగా ఉన్న విద్యుత్ లైన్లలో చెట్టుకొమ్మల తొలగింపు, లైన్ల మరమ్మత్తుల కారణంగా ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అమ్మవారి సారె ఊరేగింపు



శేషుకొండ కాలనీలో అమ్మవారి సారె ఊరేగిస్తున్న ట్రాన్స్‌జెండర్లు

యలమంచిలి రూరల్: పట్టణానికి సమీపంలో శేషుకొండ కాలనీలో నూకాంబిక అమ్మవారి రెండో వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం రాత్రి అక్కడ నివాసముంటున్న ట్రాన్స్‌జెండర్లు సారె ఊరేగింపు చేపట్టారు. వివిధ రకాల పిండి వంటలు తయారు చేసి భక్తిశ్రద్ధలతో అమ్మవారికి వాటిని నైవేద్యంగా పెట్టారు. అనంతరం కాలనీ వాసులకు ప్రసాదంగా వాటిని పంచిపెట్టారు. సారె ఊరేగింపు స్థానికులను ఆకట్టుకుంది. తమను చల్లగా చూడాలని అమ్మవారిని ప్రార్థించామని ట్రాన్స్‌జెండర్లు తెలిపారు.

సీసీ రోడ్డు పనులకు శ్రీకారం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నేతలు

మునగపాక: మూలపేట గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు కోరారు. మూలపేట దళితవాడలోని 7వ వార్డు పరిధిలో రూ.2.90 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను స్థానిక కూటమి నేతలతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాండ్రేగుల గాంధీ, ఆడారి జగన్నాథరావు, నాయుడు, శరగడం నాగేశ్వరరావు, భీశెట్టి నాగేశ్వరరావు, ఆడారి కాశీరావు, వార్డు సభ్యులు కాండ్రేగుల నాని తదితరులు పాల్గొన్నారు.



లక్ష లీటర్ల సామర్థ్యం కలిగిన పైలెట్ ప్రాజెక్టు ట్యాంకు




వరాహ నదిలో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలు

రక్షిత మంచినీటి పథకానికి..

అక్రమార్కుల గండం

- ఇసుక అక్రమ తవ్వకాలతో ప్రమాదంలో వరాహ నది
- అదే జరిగితే నది మనుగడకే ముప్పు
- నీటి చుక్క దొరక్క ఇబ్బంది పడనున్న 37 గ్రామాల ప్రజలు



వరాహ నదిలోని సమగ్ర రక్షిత మంచినీటి పథకం

కోటవురట్ల: అది 37 గ్రామాల ప్రజల దాహార్తి తీరుస్తున్న సమగ్ర రక్షిత మంచినీటి పథకం (పైలెట్ ప్రాజెక్టు). మండుటెండల్లో సైతం ఏనాడూ ఎండిపోక జీవధారలా నీటిసిరులు అందిస్తూనే ఉంటుంది. కోటవురట్ల సహా ఎస్.రాయవరం, నక్కపల్లి మండలాల ప్రజల మంచినీటి సమస్యను అలవోకగా తీరుస్తున్న ఓ మంచి ప్రాజెక్టు. ఇపుడా ప్రాజెక్టు మనుగడకు ముప్పు ఏర్పడింది. అక్రమార్కుల డబ్బు దాహంతో మంచినీటి దాహం తీరుస్తున్న ఆ ప్రాజెక్టు విశ్రాంతి తీసుకునే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. నదిలో అక్రమ ఇసుక తవ్వకాలతో పైలెట్ ప్రాజెక్టు ఉనికి ప్రశ్నార్థకం కానుంది. ఏడాపెడా ఇష్టారాజ్యంగా జరుపుతున్న అక్రమ ఇసుక తవ్వకాలు పైలెట్ ప్రాజెక్టుకు సవాల్ విసురుతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటి ప్రాజెక్టు మూతపడే ప్రమాదం పొంచి ఉంది.

లక్ష లీటర్ల సామర్థ్యం గల ట్యాంకులోకి..

రామచంద్రపురం శివారు గూడెపులోవ సమీపంలోని వరాహనదిలో ఈ సమగ్ర రక్షిత మంచినీటి (పైలెట్) ప్రాజెక్టును నిర్మించారు. దీని ద్వారా నిరంతరాయంగా నదిలోని నీటిని తోడి లక్ష లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంకులోకి నీటిని ఎక్కిస్తారు.అక్కడి నుంచి నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల మండలాలకు చెందిన 37 గ్రామాలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి



37 గ్రామాలకు తాగునీటిని సరఫరా చేస్తున్న పైలెట్ ప్రాజెక్టును అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు సమీపంలోనే ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. దీని వల్ల భూగర్భ జలాలు అడుగంటి ప్రాజెక్టుకు ముప్పు ఏర్పడే పరిస్థితులు ఉన్నాయి. అలా జరిగితే ఎంతో మంది ప్రజలు దాహార్తితో ఇబ్బంది పడతారు. అధికారులు స్పందించి అక్రమ ఇసుక తవ్వకాలకు అడ్డుకట్ట పలకాలి. రక్షిత మంచినీటి పథకానికి రక్షణ కల్పించాలి. – ఆర్ఎస్ సత్యనారాయణరాజు, మాజీ వైస్ ఎంపీపీ, తంగేడు

వాల్టా చట్టాన్ని అతిక్రమించి..

కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక పాలసీ వాల్టా చట్టానికి అక్రమార్కులు తూట్లు పొడుస్తున్నారు. సిండికేట్‌గా మారి ఇసుక స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నారు. నదిలో అక్రమ ఇసుక తవ్వకాలు భారీ స్థాయిలో జరుపుతున్నారు. వాల్టా చట్టం ప్రకారం రక్షిత మంచినీటి పథకాలు, విద్యుత్ స్తంభాలు, వంతెనలకు వంద మీటర్ల దూరం వరకు ఎటువంటి ఇసుక తవ్వకాలు జరపకూడదు. కానీ ఇక్కడ అందుకు భిన్నంగా అక్రమ ఇసుక తవ్వకాలను యథేచ్ఛగా జరుపుతున్నారు. పైలెట్ ప్రాజెక్టుకు సమీపంలోనే ఇసుక తవ్వకాలు జరిపి ఎడ్ల బళ్లు, ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా ఇసుకను తరలించుకుపోతున్నారు. దాంతో భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం ఉందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. పైలెట్ ప్రాజెక్టుకు ముప్పు పొంచి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. అనధికారిక ఇసుక రీచ్‌ల కారణంగా ప్రాజెక్టు మూత పడే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరవకపోతే నది ఎండిపోక తప్పదు. అదే జరిగితే 37 గ్రామాల ప్రజలు మంచినీటి సమస్యతో దాహం కేకలు వేస్తారని చెప్పడం అతిశయోక్తి కాదు.

అక్రమ ఇసుక తవ్వకాలతో ముప్పు..



అక్రమ ఇసుక తవ్వకాల వల్ల పైలెట్ ప్రాజెక్టుకు ముప్పు ఉంది. ఈ ప్రాజెక్టుతో మూడు మండలాలకు సంబంధించి 37 గ్రామాలకు మంచినీరు సరఫరా అవుతోంది. ప్రాజెక్టుకు దగ్గరలోనే ఇసుక అక్రమ తవ్వకాలు జరుపుతున్నారు. ఇదే అంశంపై ఇటీవల జరిగిన జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మైనింగ్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు దీనిపై చర్యలు తీసుకుంటామని వివరణ ఇచ్చారు.
– సిద్దాబత్తుల ఉమాదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు, కోటవురట్ల మండలం

ఉపాధి కూలీలకు పనుల కల్పన



నీలిగుంటలో పనులు చేస్తున్న కూలీలు

సాక్షి ఎఫెక్ట్..

కోటవురట్ల: ఉపాధి పనుల కల్పనలో కక్ష సాధింపు, వివక్ష చూపడంతో ఉపాధి కూలీలు నిరసన తెలిపిన నేపథ్యంలో 'ఉపాధి కూలీలపై కక్ష, వివక్ష' శీర్షికన సాక్షి దిన పత్రికలో కథనం వెలువడింది. నీలిగుంటలో టీడీపీకి చెందిన గ్రూపులకు మాత్రమే పనులు కల్పించారని ఆరోపిస్తూ సోమవారం కొందరు కూలీలు నిరసన తెలిపారు. 18 గ్రూపులు ఉండగా కేవలం 4 గ్రూపులకు మాత్రమే పని కల్పించారని ఆందోళన చేశారు. దీనిపై అధికారుల తీరును ఎండగడుతూ కథనం వెలువడింది. దాంతో అధికారులు స్పందించి మంగళవారం 11 గ్రూపులకు పని కల్పించారు. సర్పంచ్ వరహాలబాబు మాట్లాడుతూ అధికారులు దిగొచ్చి నీలిగుంట పరిధిలో ఉన్న 11 గ్రూపులకు పని కల్పించారని దాంతో కూలీలు హర్షం వ్యక్తం చేశారని తెలిపారు.

జాగ్రత్తలతోనే ఆరోగ్య పరిరక్షణ



మందులు అందజేస్తున్న సర్పంచ్ అప్పారావు

మునగపాక: ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరిరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి నంది విమలగిరి కోరారు. మునగపాక పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన 104 శిబిరంలో ఆమె వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులతో పాటు మహిళలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జంక్ ఫుడ్ జోలికి పోరాదన్నారు. పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. సుగర్, బీపీ పరీక్షలు క్రమం తప్పకుండా చేయించుకోవాలన్నారు. కాగా శిబిరాన్ని సర్పంచ్ దిమ్మల అప్పారావు పరిశీలించి వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం రోగులకు మందులు అందజేశారు. ఎంఎల్‌హెచ్‌పీ సంతోషి, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల వేతనాలు తక్షణం చెల్లించాలి



కొడవటిపూడిలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న కూలీలు

కోటవురట్ల: పొట్ట కూటి కోసం పని చేస్తున్న ఉపాధి కూలీలకు నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోతే ఏం తిని బతకాలంటూ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ ప్రశ్నించారు. కొడవటిపూడిలో ఉపాధి కూలీల పెండింగ్ వేతనాలపై మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధి కూలీల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి వహిస్తోందని ఆరోపించారు. పూర్తి స్థాయిలో పనులు కల్పించకపోవడంతో వ్యవసాయ కూలీలు వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, పనిముట్లకు నగదు చెల్లించాలని, వేసవి అలవెన్సు వేయాలని, పని ప్రదేశాల్లో టెంట్లు వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.కన్నయ్య, పి.రమణ, సూరిబాబు, బీమరాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లకు అడ్డంకిగా ఉన్నాయని చెట్ల నరికివేత



సోమలింగపాలెం-యలమంచిలి రహదారిలో నరికివేతకు గురైన వృక్షాలు



నరికివేతతో మోడుగా మారిన వృక్షం

యలమంచిలి రూరల్: విద్యుత్ వైర్లకు అడ్డంకిగా ఉన్నాయన్న సాకుతో పట్టణ పరిధిలో సోమలింగపాలెం నుంచి యలమంచిలి వెళ్లే రహదారి పొడవునా పదుల సంఖ్యలో చెట్లను విద్యుత్ శాఖ సిబ్బంది నరికేశారు. యలమంచిలి నుంచి సైతారుపేట వెళ్లే రహదారిలో పెంజెరువు వద్ద కూడా చెట్లు నరికివేశారు. ప్రధాన రహదారులతో పాటు ముఖ్యమైన కూడళ్లలో చెట్లు ఇష్టారాజ్యంగా నరికివేయడంతో రహదారులు కళ తప్పుతున్నాయి. అధికారులే చెట్ల నరికివేతను అడ్డుకోకపోవడంతో కొందరు స్వార్థపరులు తమ ఇళ్లు, పొలాలు, పశువుల పాకల వద్ద ఉన్న వృక్షాలను నరికించి ఆ కలపను సొంతానికి వాడుకుంటున్నారు. మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా ఎదిగిన చెట్లు నేలమట్టం అయ్యాయి. దీనిపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు విలేకరులకు తెలిపారు.

ప్రభుత్వ మద్దతు ధరకు ధాన్యం అమ్ముకోవాలి



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు



సమావేశం నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

పాయకరావుపేట: మండలంలో గల మంగవరం, పెంటకోట గ్రామాల్లో మంగళవారం మండల వ్యవసాయ అధికారి పి.ఆదినారాయణ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా క్షేత్ర సందర్శన, రైతులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఏపీ ఫార్మర్ రిజిష్టరీపై రైతులకు అవగాహన కల్పించారు. 2024 – 25 కాలానికిగాను 2584 ఎకరాల విస్తీర్ణంలో అపరాలు సాగు చేస్తున్నారు. రబి ఈ – పంట ఈకేవైసీ 100 శాతం పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ సిబ్బందిని ఆదేశించారు. రైతులు ప్రభుత్వం ఇచ్చే కనీస మద్దతు ధర్‌పై ధాన్యం అమ్ముకోవాలని తెలిపారు. పట్టణంలో మండల రైతు సోదరులు సమీప రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి త్వరితగతిని ఏపీ ఫార్మర్ రిజిష్టరీ చేసుకోవాల్సిందిగా కోరారు. అదే విధంగా పంటలకు సోకే తెగుళ్లను ఎన్‌పీఎస్ఎస్ యాప్ ద్వారా ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సత్యవరం గ్రామ ఉద్యాన సహాయకులు పి.మౌనిష్, వ్యవసాయ సహాయకులు ఎస్.అమృత, సర్పంచ్ నఖిలేటి రాము, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ గడువు 31

మునగపాక: ప్రతి రేషన్ కార్డు హోల్డర్ తప్పనిసరిగా ఈ నెల 31లోగా ఈకేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈకేవైసీ చేయించుకున్న వారికి మాత్రమే వచ్చే నెల నుంచి రేషన్ సరకులు బటావ్డా చేస్తారన్నారు. స్థానికంగా ఉన్న డీలర్ల వద్ద ఈకేవైసీ చేయించుకోవాలని ఆయన సూచించారు. ఈకేవైసీ పెండింగ్ జాబితా డీలర్ల వద్ద ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పరవాడ డీఎస్పీ మునగపాక పీఎస్ సందర్శన

మునగపాక: స్థానిక పోలీసు స్టేషన్‌ను మంగళవారం పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ సందర్శించారు. మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న గ్రామ దేవతల పండగలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని సూచించారు. అనంతరం వాడ్రాపల్లి, తోటాడ, గవర్ల అనకాపల్లి తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఉత్సవం ప్రశాంతంగా జరిగేలా సూచనలు చేశారు. ఎస్ఐ ప్రసాదరావు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మరక్షణ

యలమంచిలి రూరల్: మార్షల్ ఆర్ట్స్‌లో తర్ఫీదు పొందితే అత్యవసర సమయాల్లో విద్యార్థినుల ఆత్మరక్షణకు ఎంతగానో ఉపయోగపడుతుందని మార్షల్ ఆర్ట్స్ శిక్షకుడు నక్కా వెంకటరమణ తెలిపారు. పట్టణ పోలీసుల సౌజన్యంతో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థినులకు మార్షల్ ఆర్ట్స్‌లో ఉచిత శిక్షణను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఓ ప్రైవేటు పాఠశాలలో 8,9 తరగతుల బాలికలకు మార్షల్ ఆర్ట్స్‌లో మెలకువలను నేర్పించారు. ప్రతిరోజూ అర్ధగంట సేపు శిక్షణ ఇస్తామని పట్టణ పోలీసులు తెలిపారు.

సీతారామాలయానికి హంగులు

మాడుగుల రూరల్ : కె.జె.పురంలోని శ్రీ సీతారామాలయంలో వచ్చే నెలలో జరిగే శ్రీరామ నవమి వేడుకలకు రంగులు, పునర్నిర్మాణ పనులు చేపట్టారు. ప్రధానంగా గ్రామస్తులు, దాతల సహకారంతో ఆలయం అంతా రంగులు వేస్తున్నారు. దీంతో పాటు ఆలయంలో గర్భగుడి, ముందు భాగంలో మార్బుల్స్‌తో పనులు చేపట్టారు.

ఘనంగా గ్రామదేవతల పండగలు ప్రారంభం



గంగ పరదేశమ్మ తల్లిని దర్శించుకుంటున్న భక్తులు



పారిపల్లెమ్మ తల్లిని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక: మండలంలోని తోటాడ, గవర్ల అనకాపల్లి, వాడ్రాపల్లి, గొల్లలపాలెం తదితర గ్రామాల్లో మంగళవారం గ్రామదేవతల పండగలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వాడ్రాపల్లిలో పేరు గాంచిన పారిపల్లెమ్మ తల్లిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలి వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ తగు చర్యలు తీసుకుంది. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, కూటమి నేతలు మళ్ల సురేంద్ర, కర్రి సాయికృష్ణ తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా పొల్లయిన్ యూత్ అధ్యక్షుడు మళ్ల రాజేష్ భక్తుల సౌకర్యార్థం ప్రసాద వితరణ గావించారు. అలాగే తోటాడ, గవర్ల అనకాపల్లి గ్రామాల్లో గంగ పరదేశమ్మ తల్లి పండగ కూడా ఘనంగా నిర్వహించారు. జనసేన ఉత్తరాంధ్ర కన్వీనర్ సుందరపు సతీష్‌కుమార్, తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణితో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు అమ్మవారిని దర్శించుకున్నారు.

వృథాగా 40 బస్తాల సిమెంట్



పంచాయతీ భవనంలో పాడై గడ్డ కట్టిన సిమెంట్



వినియోగంలో లేని పంచాయతీ భవనం

ఎస్.రాయవరం: చిన్నగుమ్ములూరు గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భవనంలో సుమారు 40 బస్తాల సిమెంట్ వృథాగా పడి ఉంది. దీన్ని ఉపయోగించకపోవడం వల్ల గడ్డ కట్టింది. ఇది ప్రైవేటు వ్యక్తులకి చెందినది అయితే ప్రభుత్వ భవనంలో ఎందుకు వేసి ఉంటారని ప్రశ్నిస్తున్నారు. పదుల సంఖ్యలో సిమెంట్ గడ్డ కట్టి పాడవడం పట్ల పలువురు విమర్శలు చేస్తున్నారు. ఇలా పాడైన సిమెంట్ భవనంలో వృథాగా వదిలేయడం వల్ల భవనం కూడా శిథిలావస్థకు చేరుకుని పాడవుతోంది. అయినప్పటికీ అధికారులు పరిశీలించకపోవడం దారుణమని పలువురు విమర్శిస్తున్నారు. ఈ సమస్యపై మండల ఇంజినీర్ దుర్గా శంకర్‌ను వివరణ కోరగా సిమెంట్ ఎక్కడా వృథాగా వదిలేయలేదన్నారు. 2018లో జెడ్పీ హైస్కూల్లో పనుల నిమిత్తం కాంట్రాక్టర్ వేసిన సిమెంట్ పనులు చేపట్టకుండా వదిలేయడం వల్ల పాడయిందన్నారు. ఇప్పుడు ఆ కాంట్రాక్టర్ ఎస్.రాయవరం మండలంలో పని చేయడంలేదని చెప్పారు. పంచాయతీ భవనంలో ఉంది కనుక పంచాయతీ సిబ్బంది చూసుకుంటారని చెప్పారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి ఎం.సాయిలక్ష్మిని వివరణ కోరగా పంచాయతీ భవనంలో ఎవరు సిమెంట్ వేశారో తెలియదన్నారు. భవనం శిథిలం కాకుండా శుభ్రం చేయించి వినియోగంలోకి తీసుకొస్తామన్నారు.

జోగన్నపాలెంలో మావుళ్లమ్మ పండగ



అమ్మవారిని దర్శించుకున్న మాజీ డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు తదితరులు

కె.కోటపాడు : కింతాడ పంచాయతీ జోగన్నపాలెం గ్రామస్తులు మావుళ్లమ్మ అమ్మవారి పండగను మంగళవారం భక్తిశ్రద్ధలతో జరిపారు. గ్రామానికి చెందిన కుబిరెడ్డి కుటుంబీకులు 30 ఏళ్ల తరువాత అమ్మవారి పండగను నిర్వహించారు. మావుళ్లమ్మ మందిరంలో ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు మొక్కులు చెల్లించుకునేందుకు బారులు తీరారు. మావుళ్లమ్మ మందిరంలో మాజీ డిప్యూటీ సీఎం, అనకాపల్లి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు ప్రత్యేక పూజలను జరిపారు. ఆయన వెంట సర్పంచ్ బండారు ఈశ్వరమ్మ, ఉప సర్పంచ్ బండారు ముత్యాలనాయుడు పాల్గొన్నారు. నిర్వాహక కమిటీ సభ్యులు మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.